కథ

# కాలం చెల్లిన కాలుష్యం

మెలుగు కమలాకాంత్

'హేరాం జయ జయరాం.. జయారాం జయ జయరాం' లౌడ్ స్పీకర్‌లో నుంచి ఫుల్ సౌండ్‌లో తెల్లవారుఝామున ఐదింటినించీ పాట వినబడుతూనే ఉంది. నిరంతరంగా ఆ రెండు మాటలే.

'నాన్నా సంతోష్... ఇంక లేచి చదువుకో ... అసలే రేపటి నించీ హాఫ్ ఇయర్లీ ఎగ్జామ్స్' కొడుకుని లేపుతున్నాడు రాఘవరావు. అలా దాదాపు పది నిమిషాల గోల తర్వాత ఐదున్నరకి లేచాడు సంతోష్. టెన్త్ క్లాస్ చదువుతున్నాడు. పుస్తకం ముందేసుకుని కూర్చున్నాడు. ఎంత చదువుదామన్నా ఆ అరిగిపోయిన పాటే పెద్దగా వినిపిస్తోంది. చదువు ముందుకు సాగట్లేదు.

ఓ అరగంట కునుకు తీసి ఆరింటికి వాకింగ్‌కి లేద్దామనుకున్న రాఘవరావుకీ నిద్ర పట్టడం లేదా గోలకి.ఎలాగో పక్కమీద దొర్లీదొర్లీ ఆరింటికి లేవబోతుంటే 'అల్లా..'అంటూ మసీదులోని స్పీకర్ లోంచి ఉర్దూలో ఏదో భారీ ఉప న్యాసం. ఏమాత్రం శ్రవణయోగ్యం కాని గొంతులో.. అలా కంటిన్యువస్‌గా సాగి పోతోంది.

కొడుకు వేపు జాలిగా చూసి ప్చ్.. లాభం లేదు..ఇవిపెట్టేవాళ్ళని వాయించి పారె య్యాలి. న్యూసెన్స్ కేస్ పెట్టాలి. ఛఛ' అంటూ గత రెణ్ణెల్లలో అరవయ్యోసారి అనుకున్నాడు రోజూ ఇదే తంతు.

అలా మార్నింగ్ వాక్‌కి బయల్దేరాడు. దగ్గర్లో ఉన్నకాలేజ్‌గ్రౌండ్స్‌కి ముగ్గురు స్నేహితులు వస్తారు. నలుగురూ కలిసి వాకింగ్, సూర్య నమస్కారాలు, ఎక్సర్‌సైజులూ చేస్తారు రోజూ.

అలా నడుస్తూ వెళ్తుంటే కార్తీకమాసం కావటంతో, అయ్యప్ప భక్తులు పెద్ద స్పీకర్ పెట్టుకొని భజనలతో హోరెత్తిస్తూ, డప్పులు నృత్యాలతో ప్రదర్శన.. నగర సంకీర్తన.

తెల్లవారుఝామునే లేచి ఎముకలు కొరికే చలిలో తలస్నానం చేసి, కాళ్ళకు చెప్పులన్నా లేకుండా ఈ భజనలు. ఇది నిజంగా భక్తేనా! ఆశ్చర్యమేసింది రాఘవరావుకి.

ఇంతలో వాళ్ళలో ఓ స్వామి మైక్‌లో పాటందుకున్నాడు.

'స్వామియే శరణమయ్యప్ప. నీ నామమే మాకు దిక్కప్ప' అంటూ

'అబ్బనీ తియ్యనీ దెబ్బ' అనే పాట ట్యూన్‌లో అతను పాడుతుంటే మిగతా స్వాములంతా కోరస్ పాడుతున్నారు.

రాఘవరావుకి ఒళ్ళు మండిపోయింది. ఇట్లాంటి పాటలని పవిత్రమైన భక్తిపాటలకి ట్యూన్‌గా వాడుకుంటున్న వాళ్ల అజ్ఞానానికి చాలా బాధపడ్డాడు. ఈ ధ్వని కాలుష్యానికి రెండు చెవులూ ఎంతగా మూసుకున్నా ఆ డెసిబుల్స్‌కి సౌండ్ కంట్రోల్ కావట్లేదు. వెళ్ళి ఎవరికన్నా చెబుదామన్నా, వినే స్థితిలో ఒక్కడూ లేడు.

ఈలోగా మరో పక్కనుంచి 'సువార్త కూటముల'మైక్ తనపని తాను చేసుకుంటూ పోతోంది.

'ఆహా. నా భారతదేశమా! ఏమి మత సామరస్యం? ఈ ధ్వని కాలుష్యం విషయంలో సర్వమతాలూ ఎంతటి సమానత్వాన్నీ సమన్వయాన్నీ పాటిస్తున్నాయో గదా.. హే రామ్ ఏ అల్లా ఓ జీసస్!' అంటూ ఆశ్చర్యపడిపోయాడు రాఘవరావు.

మొత్తం మీద రోజూ కన్నా అరగంట ఆలస్యంగా కాలేజ్ గ్రౌండ్స్ చేరాడు రాఘవరావు. అప్పటికే తన వాకింగ్ మిత్రులు ఆలీ, జేమ్స్, నారాయణ కాలేజ్‌గేట్ బయటే నిలబడి ఎదురు చూస్తున్నారు.

గుడ్‌మార్నింగ్‌లయ్యాక 'ఇవ్వాళ వాకింగ్ అండ్ ఎక్సర్‌సైజ్‌లకి సెలవే' అంటుంటే ఆ మాటల్ని మింగేస్తూ కాలేజ్‌లోంచి పాట 'తెలుగు ప్రజల సారథీ నీవే మా వారధీ' అంటూ ప్రక్క ప్రక్కన నించున్న వాళ్ళకి కూడా ఒకరి మాట మరొకరికి అరుచుకున్నా వినిపించనంత భారీ శబ్దంతో ఉత్తేజంగా పాడుతున్నాడెవడో ఒక వర్ధమాన గాయకుడు.

మొత్తం మీద మిత్రులంతా ఫర్లాంగ్ దూరం పారిపోయినంత పని చేశాక ఆలీ చెప్పాడు.

'ఈ రోజు మహిళా సాధికారతా సదస్సు ఈ కాలేజీలో, స్థానిక ఎమ్మెల్యే లక్షమంది మహిళలని డబ్బులిచ్చి మరీ తరలిస్తున్నాడు రాష్ట్రం మొత్తం నించీ; జేమ్స్ అందుకుని 'మరి ఇంత హడావిడి చేస్తే గానీ తనకి ఈసారన్నా మంత్రి పదవి దక్కదుగదా' అన్నాడు.

రాఘవరావు, నారాయణ నవ్వేశారు. ఈ గందరగోళంతో కాలేజ్ అంతా మార్మోగి పోతుండటంతో ' ఈ రోజుకి ఖాళీ' అనుకుని అంతా ఇళ్ళకు బయల్దేరారు. అప్పల్సామి కాంటీన్లో కాఫీ తాగి వెళ్దామన్నాడు నారాయణ. అంతా సరేనన్నారు.

'కర్ర్.. కర్ర్' మంటూ కీచుమని శబ్దం చేస్తూ, తలలకి రిబ్బన్లు కట్టుకుని జీన్ పాంట్స్, చేతుల బనీన్లు ధరించిన 'యూత్' కొంతమంది 'సైలెన్సర్లు' తీసేసిన బైక్స్‌మీద రౌండ్స్ వేస్తూ, కీచుమని సడన్ బ్రేక్స్ వేస్తూ, బర్రున మోతతో యాక్సిలేటర్లను ఫుల్‌గా రైజ్ చేస్తూ తలలు వాయగొడుతూ రోడ్లమీద స్వైర విహారం చేస్తున్నారు. పైగా చేతిలో ఉన్న పాన్ పరాగ్, గుట్కా పాకెట్లను ఖాళీ చేసి రోడ్‌పై పారేస్తూ, సిగరెట్ పొగను రింగులుగా వదుల్తూ ఈ రోడ్లన్నిటికీ తామే రారాజులూ, చక్రవర్తులూ అన్నట్లు పోజ్... వాళ్ళ వాహనాలు వదిలే విపరీతమైన పొగ ఆ ప్రాంతాన్నంతా కప్పేసింది.

ఎవణ్ణి కదిలిస్తే ఉన్మాదంలో ఏం చేస్తాడో, బూతులు తిడతాడో, చెయ్యి చేసుకుంటాడో ... అసలే పొలిటికల్ పార్టీకి చెందిన వాళ్ళు పైగా యూత్.. మనకెందుకులే అని స్నేహితులు నలుగురూ...ముక్కు ,చెవులు మూసుకొని ప్రక్కకి తప్పుకున్నారు. కాఫీ తాగి ఇళ్ళకి బయల్దేరారు.

ఇలాంటి చెత్తకారణాల వల్ల 'రొటీన్' కి దెబ్బ కలగడంతో ఒకింత చిరాగ్గా, ఈ ధ్వని, వాయు కాలుష్య భరితమైన వాతావరణంలోంచి ఎటూ పారిపోలేని నిస్సహాయస్థితిలో ఇల్లు చేరాడు రాఘవరావు.

అప్పుడే వచ్చిన స్కూల్‌బస్ డ్రైవర్ ఆపకుండా హారన్ కొడుతున్నాడు. సంతోష్ పరిగెత్తుకెళ్లి బస్ ఎక్కితే గానీ ఆ హారన్ ఆగలేదు. ఇదో మోత... ప్చ్... టెన్త్‌క్లాస్ అని చెప్పి ఆదివారం కూడా స్కూలే వాడికి.

'ఖయ్‌' మని ఈల వేస్తూ చెత్త తీసికెళ్ళేవాడూ.. పీపీ...అంటూ తన రాకని అన్ని ఇళ్లకీ తెలియజెయ్యాలని 'గట్టిగా' తాపత్రయపడుతున్న చెత్త తాలూకు ఆటోడ్రైవర్.

ఈ మోతలకి బుర్ర వేడెక్కిపోతున్న రాఘవ రావుకి... ఇంట్లోని గోడగడియారం.. ఓ 45 సెకన్ల పాటు మ్యూజిక్ వినిపించి తొమ్మిది గంటలు కొట్టడంతో. పిచ్చెక్కి అందులోని బ్యాటరీ తీసి విసిరి పారేశాడు. ఎందుకంటే దానివరకూ తానే యజమానిగాబట్టి.

స్నానం చేసి, టిఫిన్ చేసి ప్రశాంతంగా ఓ గంటసేపు ఆదివారం నాడన్నా పేపర్ చదువుకుందామంటే ఈ లౌడ్ స్పీకర్ల గోలతో కుదిరి చావట్లేదు.

ఫోన్ చేసి స్నేహితులు ముగ్గుర్నీ పిలిపించాడు. సెలవు కావడంతో పదిన్నరకల్లా ముగ్గురు మిత్రులూ రాఘవరావింట్లో ఉన్నారు. నారాయణ హెడ్‌మాస్టర్‌గానూ, ఆలీ సబ్‌రిజిస్ట్రార్ గానూ, జేమ్స్ బ్యాంక్ ఆఫీసరుగానూపని చేస్తున్నారు.

చెల్లెమ్మా.... మాంచి కాఫీ పెట్టమ్మా... ఆదివారమని మీ వదిన ప్రార్థనకెళ్లింది. ఇంతవరకూ రాలేదు. జేమ్స్ స్వతంత్రంగా అన్నాడు.

'ఏమిట్రా ఇంత హడావిడిగా రమ్మని ఫోన్ చేశావ్?' నారాయణ ప్రశ్న, 'సరదాగా పేకాడదామా భాయ్?' ఆలీ హుషారుగా అన్నాడు.



**అనంతపురంలో (మే 31న) నిర్వహింపబడిన రాష్ట్ర ఎపి ఎన్‌జిఓ అసోసియేషన్ మహాసభలతో ప్రముఖ కవి సరికొండ నరసింహారాజును సత్కరిస్తున్న దృశ్యం. 'ఒకే ఒక్క సిరాచుక్క' నానీల ఆవిష్కర్త రాష్ట్ర జెఏసి చైర్మన్ శ్రీ గోపాలరెడ్డి, అశోక్‌బాబు, శ్రీ డి.కోటేశ్వరరావు తదితర ఎన్‌జిఓ నాయకులు చిత్రంలో వున్నారు**

ముభావంగా, ఖిన్నుడై ఉన్న రాఘవరావుని చూసి కంగారుపడ్డ జేమ్స్ ఏం రాఘవా! ఒంట్లో బాలేదా? అడిగాడు.

'అలాంటిదేమీ లేదన్నయ్యా! ఈ లౌడ్‌స్పీకర్ల గోలతో మనసుకు ప్రశాంతత లేక, పిల్లలు చదువు కుందామంటే కుదరక,సరిగ్గా నిద్రలేక, చెవులు హోరెత్తిపోయి ఎవరికి చెప్పినా ఏమీ లాభంలేక... ఏమిచెయ్యాలో పాలుపోక, కనీసం ఆదివారమన్నా ప్రశాంతంగా బతకలేకపోతున్నావే అని బాధ పడుతున్నారు...ప్చ్ అయినా ఈయన పిచ్చిగానీ, ఎవడికీ పట్టని బాధ మన ఒక్కళ్ళకేనా? పట్టించుకోవద్దంటే వినరూ' సీతాదేవి సుదీర్ఘోపన్యాసం చేసింది.

'నిజమే భాయ్. ఈ ఇబ్బంది నీ ఒక్కడిదీ కాదు. అందరిదీ' అన్నాడు ఆలీ.

'ప్రతివాడూ మనకెందుకులే అని కూర్చుంటే సమస్యకి పరిష్కారమెలా వస్తుంది? అన్నాడు నారాయణ.

'ఈ గోలలూ, రణగొణ ధ్వనుల నుంచి మనని మనం కాపాడుకోవటానికి ఏమైనా చెయ్యాలి' జేమ్స్ ఉవాచ.

'ఏం చేద్దాం? ఎలా చేద్దాం? చెప్పండి అదృష్ట వశాత్తు హిందూ, ముస్లిం, క్రిష్టియన్ మూడు మతాలకు ప్రతినిధులం ఇక్కడే ఉన్నాం. ఆలోచించండి. ఏదన్నా చక్కటి పరిష్కారం చూడండి' రాఘవరావు అభ్యర్థన. ఈలోగా కాఫీ వచ్చింది.

మిత్రులు నలుగురూ తర్జనభర్జనలు మల్లగుల్లాలుపడ్డారు. రెండుగంటల సుదీర్ఘ సమాలోచల అనంతరం అంతా కలిసి ఒక నిర్ణయానికి వచ్చారు. తాము నలుగురూ విభిన్న రంగాల్లో మంచి పొజిషన్స్‌లో ఉన్నవాళ్లు కావడంతో మరుసటి ఆదివారం ఓ వందమంది స్థానిక ముఖ్యులతో 'గెట్ టుగెదర్' ఏర్పాటు చేశారు.

శబ్ద కాలుష్యం కలిగిస్తున్న నష్టాలని గురించిఆలీ, నారాయణ కూలం కషంగా సభికులకు వివరించారు. చాలామంది చర్చిలో పాలు పంచుకున్నారు.

తత్ఫలితంగా ఆవిర్భవించిందే 'ధ్వని

కాలుష్య నివారణ సంఘం' సంఘ సభ్యుల్లో ఏ మతానికి సంబంధించిన వాళ్ళు ఆమత పెద్దలతో చర్చించారు.

భక్తి అనేది మనసుకి సంబంధించినదనీ, అది వైయక్తికమైనదనీ దాన్ని ప్రదర్శించుకోవలసిన అవసరం లేదనీ, దాన్ని బహిర్గతం చేయడానికి మైకులహోరు బొత్తిగా అనవసరమనే విషయాలని సర్వమత నాయకులతో చర్చించి వారిని ఒప్పించి, తమ అనుయాయులకి చెప్పించారు. దాంతో మర్నాటి నుంచీ పట్టణంలోని మత సంబంధమైన లౌడ్ స్పీకర్లహోరు పూర్తిగా తగ్గిపోయింది.

'డీ.కే.యస్.యస్.' (ధ్వని కాలుష్య నివారణ సంఘం) తరపున కార్యకర్తలు అన్ని రాజకీయ పార్టీల నాయకులను కలిసి వాళ్ళ కార్యకర్తల వీరంగాలని నియంత్రించాలని కోరారు. ముఖ్యంగా సైలెన్సర్ లేని బళ్ళని వాడడం, విపరీతమైన హారన్స్‌ని నివారించాలని కోరిన మేరకు వారి నుంచీ సానుకూల స్పందన వెలువడింది.

స్కూల్ యాజమాన్యాలని సంప్రదించి వాటి బస్సుల డ్రైవర్ల హారన్స్ మోతను కంట్రోల్ చెయ్యాలని అభ్యర్థించగా, అంతా పాజిటివ్‌గా స్పందించారు.

పట్టణ పోలీస్‌శాఖని సంప్రదించి, పిల్లల చదువులని భంగపరుస్తూ, ప్రశాంత జీవితం నుంచి ప్రజలను దూరం చేస్తున్న ఈ సౌండ్ పొల్యూషన్ గురించి వివరించి, అదుపు తప్పినవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డీ.కే.యస్.యస్. కోరింది. వంద మందికి పైగా సర్వమతాలకు చెందిన పురప్రముఖులు రావటంతో పోలీస్‌శాఖ సైతం తగు జాగ్రత్తలు, హెచ్చరికలు ప్రజలకు చేసింది.

రెట్టించిన ఉత్సాహంతో ఊళ్ళోని ప్రతి గల్లీలోనూ తిరిగి ప్రతి ఇంటి నించీ ఒకరిని డీ.కే.యస్.యస్ లో సభ్యునిగా చేర్చారు. కామన కాజ్ కావడంతో అంతా ఎంతో ఉత్సాహంగా ముందు కొచ్చారు.

'ఛారిటీ షుడ్ బిగిన్ ఎట్ హోమ్' అన్న సూక్తి ననుసరించి ఆ ఊళ్లో ఇంటికో డీ.కే.యస్.యస్. కార్యకర్త ఉండటంతో వాళ్ల ప్రచారంతో , 'ధ్వని కాలుష్యాన్ని నివారించండి. పర్యావరణాన్ని పరిరక్షించండి' అన్న ప్లకార్డ్ ధరించిన మౌన ప్రదర్శనలతో ఊరు ఊరంతా చైతన్యవంతమై నాటి నుండీ హాయిగా, ప్రశాంతంగా జీవించింది.

రాఘవరావు చిన్న బుర్రలో పుట్టిన ఆలోచనలోంచి ఆవిర్భవించిన 'డీ.కే.యస్.యస్' ఆ ఊళ్లోని ప్రతి ఇంటికీ సమిష్టిగా ప్రాతినిధ్యం వహిస్తూ ధ్వని కాలుష్యరహిత పట్టణంగా ఆ పట్టణాన్ని తీర్చి దిద్దింది.

అక్కడ కాలుష్యానికి కాలం చెల్లింది.

# పుంభావ సరస్వతికి సరిజోతలు

కొంపెల్ల వెంకట్రావు

వేటూరి వారి సాహిత్యము
అది ఒక ఝరీ ప్రవాహము
అమర సాహితీ సుమసౌరభ సన్నిభము
అమల కవిత్వ తత్వ తంతుర్వము
విమల నాదోంకార సమానీతము
కృతి విధానమున శ్రుతి సమానము
అరుదైన ఆ శైలి హిమశైల శిఖరాల
సురదీర్ఘికా క్రమ జల దూర్మికా కేళి
ఆ కవన మూలికలు నాక వన వాటికలు
ఆ మధుర భావాలు ఆర్ద్రతల జీవాలు
ఆ భావ గమనాలు ఆద్యంత మధురాలు
రంభోర్వశీ నాట్య గ్రంథాల గంధాలు
శ్రీ పార్వతీ దేవి లాస్యాల పలికేటి
మంజీర నాదాల మృదు మధుర వేదాలు
నీలాల గగనాల వెలిగేటి నెలరేని
తుహిన కర నికరాల తోగి వికసించేటి
కలువ గమి గమకాలు
ఉదయించు రవి కిరణ రాగాలతో విచ్చి
బిట్టలరి మురిసేటి తామరస పుష్పాల
తారాడు తమకాలు

శ్రావణమ్మె వరలు గగన వీధుల లోన
జీమూత సంఘాత సారాలు సరసాలు
భక్తి భావ ప్రణవ ప్రౌఢిమల చాటేటి
నవ్యమౌ నమకాలు
అనురాగ యోగాల వివరాల ప్రవచించు
రసరమ్య చమకాలు
ఆద్యంత రహితుడౌ నెలతాల్పు నిద్రలో
కలయైన గిరిపుత్రి తలపైన గంగోత్రి
కలిసి పులకల పేర్మి చాటి చెప్పిన కూర్మి
కొంగు బంగారాలు
విష్ణు పాదము కొలిచి వివిధ లీలల తరచి
మదిని ప్రేమను పరచి కూచి వలపుల తోటి
ఊసులాడగ తోచి విభుని చెవిలో పలుకు
చిలిపి సింగారాలు
సృష్టి జరిపే బ్రహ్మరాతలో రహస్యం
చేతలో సమస్తం తెలిసి సంతోషాలు
విరిసి తా గీర్వాణి విమల వీణా తంత్రి
మీటే విలాసాలు

తే॥ నన్నపార్యుని కవనాల నయలు కలిగి
నన్నెచోడుని కావ్యాల వన్నె వెలిగి
తిక్కనామాత్య పద్యాల తీరు తెలిసి
నాటి నాచనసోమన నీటు నెగడి
తే॥ మహిత పోతనామాత్యుని మహిమ మలగి
త్యాగరాజ కృతుల భక్తియోగమమరి
సరస శ్రీనాథ కవిరాజు వరుస విరిసి
అష్టదిగ్గజాల కృతి విశిష్ట గతుల
ఆ॥ వెలుగుతోడ మలయు వేవేల వేటూరి
పాటలన్న మాట వాస్తవమ్ము
జీవనదుల వంటి భావబంధములను
చాటిచెప్పు కవిదె పాటవమ్ము....

(శ్రీ వేటూరి వేంకట సుందర రామమూర్తి గారూ!
మీకివే మా వందనాలు
మము వీడని వసివాడని
జ్ఞాపకాల హరిచందనాలు)